సి.పి.బ్రౌన్ అకాడమీ
నవ్యవీక్లి ఉగాది కథలపోటీలో
విశేష బహుమతి
రూ. 2,000 పొందిన కథ

ఫస్టుక్లాసు రైలు ప్రయాణంలో కుదుపు అనేది అంతగా తెలియని మాట నిజమే. కాని అది శరీరానికి సంబంధించినది. మనసుకి పట్టిన కుదుపు? రాణీపద్మినీదేవి రైలు ప్రయాణంలో ముందుకి పోతున్నది ఆమె శరీరం మాత్రమే. అదుపు తప్పిన మనసు మాత్రం అలా వెనక్కి వెనక్కిపోతూనే ఉంది. ఎవరో తన జీవితాన్ని తిరగరాసినట్టూ, తనో పాఠకురాలిగా చదువుకుంటున్నట్టూ....

★★★

# చిన్నతనాన్ని చిన్నబుచ్చకండి

## అవసరాల రామకృష్ణారావు



అత్యంత ధనికులైన ఆ జమీందారీ వంశానికి ఆమె ఒక్కతే వారసురాలు గనుక సహజంగా ఆమెని రాణీపద్మినీదేవిగా ఉదహరించే వారు బంధువులంతా. కోటలాంటి ఆ భవనంలో ఆమెకి తెలియనంత వేగంగా బాల్యం రివ్వున సాగిపోయింది. డబ్బూ, అందం తెలివితేటలూ ఉన్న చిన్నపిల్లని ఏ శక్తి వచ్చి తన్నుకుపోతుందో అనేటంత మెలకువతో వాళ్లమ్మా నాన్నా ఆ అమ్మాయిని పెంచారు. ఎండా, గాలీ ఆ అమ్మాయి ఉన్నచోటికి రావాలిగాని ఆ పిల్ల పైకి వెళ్లే అవకాశం లేదు. చదువు చెప్పే గురువులు తమ గడప తొక్కాలి గాని పద్మ బయట కాలుపెట్టే అవసరం లేదు. అలాగే ఆమెకి యుక్తవయసురాగానే పరాయిగడప తొక్కి కాపరం చేసే ప్రమాదం నుంచి రక్షించడానికి ఆ తల్లిదండ్రులు విశ్వప్రయత్నం చేసి కృతకృత్యులయ్యారు. కేవలం కులం, ఆరోగ్యం అనే రెండు అర్హతలు మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. బొత్తిగా డబ్బులేని గోపాలరాజు అనే యువకుడికిచ్చి పెళ్లిచేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. బంధువర్గమంతా ఒక్కటై కత్తిదూ

సినా లక్ష్యపెట్టలేదు. పదిమందిలో సమాధానపర్చడాని కన్నట్టు అతనికో హోదా కూడా కల్పించారు. అనాథ శరణాలయపు స్థాయిలో పెరిగి ఇప్పుడింతటి అంతస్తు అందుకున్నా గోపాల్రాజు వ్యక్తిత్వం ఈ వాతావరణంలో ఇమడలేకపోయింది! రెండేళ్ళు గడవ కుండానే విరక్తి అనేది అతన్ని వెంట పెట్టింది. అక్కడ ఉన్నప్పుడు తనలాంటి అనాథలతో ఉన్నా పదిమందితో కలిసి ఉండే భాగ్యం ఉండేది. ఆ జాగా కొండలమధ్య ఉండేది. చుట్టూ పచ్చనిచెట్లు. ఎదురుగా తియ్యని నీరిచ్చే ఏరు. ప్రకృతి అందించే పలు రకాల శబ్దాలకి పరవశించే స్వేచ్ఛ తనది. గోచీపెట్టుకుని ఈతకొట్టడంలోని ఆనందం సైనిక అధికార దుస్తుల్లో కవాతు చెయ్యడంలో వస్తుందా! తన తప్పు తెలుసుకొనే సరికి కొడుకుకూడా పుట్టేశాడు! అయినా ఆ బంధం గాని, భార్య అంద చందాలు గాని, అత్తమామల భోగభాగ్యాలుగాని గోపాల్రాజుని కట్టి పడెయ్యలేక పోయాయి. 'పుట్టుకతో వచ్చిన దరిద్రపు లక్షణాలు ఎక్కడికి పోతాయి!' అంటూ వాళ్లతో పాటు భార్య కూడా సణుక్కోడం విని అతను భరించలేకపోయాడు. పారిపోయే ప్రయత్నంలో అతను మృత్యువాత పడ్డాడు. కూతురి బతుకిలా అయిపోయిందన్న వేదనతో 'మా బాగా అయిందనే' బంధువుల అవమానం భరించలేక మంచం పట్టిన వారిద్దరూ మరి లేవలేదు!

ఇటు కట్టుకున్న భర్తా అటు కన్న తల్లిదండ్రులూ ఆరునెలల తేడాతో మటు మాయం అవడంతో పద్మిని బతుకు అంధకారమై పోయింది. మూడు నెలలకి కాని మళ్లీ మనిషి కాలేకపోయింది. అప్పుడైనా స్వామి నిర్మలానంద మహరాజ్ ఆశీర్వాద బలం వల్లనే అని ఆమె నమ్మకం. ఆయన సాధారణంగా తన రుషీకేశ్ ఆశ్రమం వదలరు. భక్తులకోరిక కాదనలేక ఆంధ్రప్రదేశ్ తిరుగుతూ తన ఊరు రావడం పద్మిని అదృష్టం. ఇంటిపట్టునే ఉన్నా భారత భాగవతాదులు పఠించడంకాక ఎమ్మే తెలుగు ప్రైవేటుగా కట్టి పాసయింది కూడా. అదిప్పుడు పనికొచ్చి తనకి పునర్జీవం ప్రసాదించింది. నిజానికి అంతటి ఆస్తినీ స్వామి పాదాంకితం చేసినా తన రుణం తీరదు. ఇంతకీ తనకేం ఆస్తి మిగిలిందని! లోకజ్ఞానం లేని ఒంటరి ఆడదాన్ని అలుసుగా తీసుకుని విశ్వాసపాత్రుడనుకున్న దివానే దొరికిన ఆభరణాలు చేజిక్కించుకుని ఉడాయించాడు. భవనమంతా శిథిలమైపోతే ఏదో యాక్టు కింద గవర్నమెంట్ ఫాక్టరీ కడతామని ముదరాగా తనకో ఎకరం యివ్వడం గగనమై పోయింది. స్థానికుల సానుభూతితో అక్కడే ఓ పెద్ద ఇల్లు కట్టుకో గలిగింది. ఊళ్లో హైస్కూల్లో టీచరుగా చేరి క్రమ క్రమంగా హెడ్మినిస్ట్రెస్ స్థాయికి చేరుకోడం ఆమెను మళ్లీ నిలదొక్కుకొనేలా చేసింది.

అంతకుముందు, సుమారు పాతికేళ్ల పైమాటగా, ఆవిడ అనుభవించిన మానసిక సంఘర్షణ తక్కువదా! తన భర్త గోపాల్రాజయితే తప్పుకున్నాడు గాని తన స్థానంలో కొయ్యలాంటి కొడుకు నొకణ్ణి ప్రతిష్ఠించి మరీ పగ తీర్చుకున్నాడు. చిన్నప్పట్నుంచి అవేం దరిద్రపు బుద్ధులు పుణికి పుచ్చుకుని పుట్టాడో గాని ఏ మాత్రం ఖరీదైన బట్టలు తొడిగినా విప్పేదాకా ఏడ్చేవాడు. ఎంతసేపూ మట్టిలో ఆట. నీటిలో జలకాలాట. ఎంతవద్దని వారించినా తోట మాలి కొడుకు తోటి పాలికాపు చిన్నతమ్ముడి తోటీ స్నేహం. ఎంతసేపూ గోడల మీదో చెట్ల మీదో మకాం. టీచరొస్తే అందకుండా పరుగులు. అలగా జనాన్ని పోగు చేసుకుని తోటల్లో పడి దొరికిన పచ్చి కాయలన్నీ కొల్లగొట్టడం! వయసు పెరిగినకొద్దీ ఆకతాయి తనం హెచ్చింది. తనకి తోచిన పద్ధతిలో వాణ్ణి తీర్చిదిద్దాలనే పద్మిని ఏ ప్రయత్నమూ ఫలించలేదు. పోనీ పెళ్లిచేస్తే ఓ దారికి వస్తాడేమో అనుకుంటే అక్కడా తన దారి తనే చూసుకున్నాడు. ఓ నాయుళ్ల మ్మాయిని ప్రేమించాట్ట. చెప్పాపెట్టకుండా గుళ్లోకెళ్లి దండలు మార్చు కున్నాట్ట. అదెంతో తండ్రిని మించిన మొండితనమో ఆస్తిని కూడా కాలదన్ని ఏదో ఓ సామాన్య నౌకరీ సంపాదించి పట్నంలో స్వేచ్ఛగా బతుకుతున్నాట్ట. ఓ కొడుకుని కని యిలా చూపించి అలా తీసుకు పోయాడు!

వీళ్లందరూ తనని ఎందుకిలా దూరం చేసుకుంటున్నారో పద్మినికి బోధ పళ్లేదు. కానియ్యి. తనని ఒంటరిగానే బతకమని దేవుడు శాసించాడు. పదిమందితో పెరిగే వాతావరణం కల్పించలేదని తన మనసెప్పుడూ తల్లిదండ్రుల్ని తప్పుపట్టలేదు. ఒంటరితనమే సహజమనే స్థితికి తనెప్పుడో చేరుకుంది. ఇప్పుడామెకు ఇరవై నాలుగ్గంటలూ నిర్వహించ వలసిన హెడ్మిస్ట్రెస్ గిరీ ఉంది. రోజల్లా పనిచేసి అలసిపోయి నిద్ర పోతుంది. ఏ కాస్త ఒత్తిడికి లోనయినా స్వామిని తలచుకుని ధ్యానం చేసుకుని యధాస్థితికి చేరుకోడానికి ఆమె మనసు అలవాటు పడింది.

అందర్నీ వదులుకుని స్కూలు నిర్వహణలో ఎన్నెన్నో మన్ననలు పొందుతూ స్వాంతన లభిస్తోందని ఇన్నాళ్లూ భావించింది పద్మిని. కాని ఆ సంస్థ నుంచే ఎదురుదెబ్బ తగులుతుందని ఆమె కలలో అనుకోలేదు! ఆమె క్రమశిక్షణకీ సమయపాలనకీ ప్రభుత్వమే మెచ్చుకుని బెస్ట్ టీచరు ఎవార్డు కూడా యిచ్చింది. తనో నియంత అనీ, తనకింద పనిచేసే ఉపాధ్యాయ బృందమంతా పరమవిధేయులనీ, తన స్కూలు ఓ కర్మాగారం కాని విద్యాలయం కాదనీ గిట్టని వాళ్లు ఎన్నికూస్తే తనకేం! ఏటా తన స్కూలు ప్రొడ్యూస్ చేసే ఫస్టు క్లాసు రిజల్టు మాట?

ఎంత స్ట్రిక్ట్‌గా వ్యవహరించినా తనూ మనసున్న మనిషే. రాతిగుంటలో వానచుక్క చేరినట్టు ఎప్పుడైనా అమ్మా నాన్నా గుర్తొస్తారు. రాలిపోయిన ఆకును చల్లగాలి పైకి లేపినట్టు మొగుడు గుర్తొస్తాడు. చలవరాతి బండ నైనా మండుటెండ కిరణం కరిగించినట్టు కొడుకూ కోడలు గుర్తొస్తారు. ఎండు తొర్రలోంచి రామచిలక తొంగిచూసినట్టు మనవడు వెధవ గుర్తొచ్చి చంపుతాడు, తాడు తెంపుతాడు! ఎలాంటి నిస్సహాయస్థితికి తను తాత్కాలికంగా లోనైనా చేయి పట్టుకులేపడానికి స్కూలు పని ఉంది. మరిప్పుడు ఆ స్కూలు నుంచే తనకో చిక్కుసమస్య ఎదురైతే ఎలా పరిష్కరించుకోవాలి! తనే స్వయంగా ఉద్యోగమిచ్చిన మధుసూదన్ అనే కుర్ర టీచరే తననీ మధ్య కుదిపేస్తున్న కొత్త ప్రాబ్లెం! చిన్న క్లాసులకి పాఠాలు చెప్పే మధుసూదన్ మీద మొదట్నుంచీ ఫిర్యాదులే!



రెండో రోజే మధు స్కూలికి అయిదు నిమషాలు ఆలస్యంగా వచ్చాడు. రూల్సు ప్రకారం పదీ అయేసరికి గేటు తాళం పడిపోతుంది. పిల్లలకే కాదు, టీచర్లకీ ప్రవేశం నిషేధమే. గేటులోంచి రావొద్దన్నారు గాని పక్క నున్న పొట్టి కాంపౌండు గోడ గెంతి రాకూడదని రూలేం లేదుగా! మధూ అలాగే చేశాడు. వాచ్‌మెన్ ఫోన్‌చేస్తే పద్మిని అతన్ని తన రూంకి పిలిపించింది.

'దార్లో చావు బతుకుల్లో ఉన్న ఓ ఊరకుక్క కనిపించింది. చుట్టూ కుంయ్ కుంయ్ మంటున్న కుక్కపిల్లలు. ఎలా వదిలెయ్యను చెప్పండి మేడమ్! ఆటోలో దాన్ని పశువుల ఆస్పత్రికి చేర్చాను. చేతి డబ్బు వదిలితే వదిలింది గాని సమయానికి సెలైను ఎక్కించి దాని ప్రాణం నిలబెట్టారు. తల్లిని బతికించి పిల్లలకి అప్పచెప్పే సరికి కాస్త ఆలశ్యమైంది మేడమ్!'.

అంటే ఏం జవాబు చెప్పడం!

తరగతి గదుల్లో కూచోడానికి పిల్లలకి బల్లలుంటాయి. బ్లాక్‌బోర్డు సమీపంలో ఓ బల్లా కుర్చీ

ఉంటాయి గాని ఆ కుర్చీ ఎవరైనా ఇనస్పెక్షన్‌కి వచ్చినప్పుడు కూర్చోడానికి తప్ప టీచరు కూచోడానికి మాత్రం కాదు! మేష్టరన్నవాడు ఒళ్లు దగ్గిర పెట్టుకని పీరియడు గంటసేపూ నిలబడి మాత్రమే పాఠాలు చెప్పాలని ఆ స్కూలు రూలు. ఓసారి పద్మిని రౌండ్సుల్లో వాళ్ల క్లాసుకి ఇనస్పెక్షనుకి వెడితే నిశ్శబ్దంగానే ఉంది గాని టీచరు గబుక్కుని కనపడడే! ఏడని వెదికితే ఓ కుర్రాడి పక్కన కూచుని వాడి నోట్సు దిద్దుతున్నాడు! 'కుర్చీలో కూచోవద్దన్నారు గాని బెంచీ మీద కూచో కూడదని రూలేం లేదుగా!' అనే సంజాయిషీ ఒకటీ!

ఇలాగే ఏ రోజుకారోజు ఏదో ఓ క్రమశిక్షణకి ఉల్లంఘన! సాటి టీచర్లు చెప్పడం కాదు, తనే చూసింది. డ్రెస్ రెగ్యులేషన్స్ పాటించడు, సిలబస్ ప్రకారం పాఠం చెప్పడు. నెల నెలకీ పెరిగిపోతున్న అతని క్రమశిక్షణా రాహిత్యం వల్ల సంస్థ పేరు దెబ్బ తినే ప్రమాదముంది. ఇక అతన్ని ఉద్యోగం నుంచి తొలగించడం ఒకటే తనకి మిగిలిన మార్గమనే నిశ్చయానికి పద్మిని వచ్చేసింది. అయితే అసలైన కంప్లెయింట్ పిల్లల నుంచి రావాలి. స్టూడెంట్ లీడర్సుని ఇంటికి పిలిపించి సేకరించిన అభిప్రాయంతో ఆమె మొహం తిరిగిపోయింది!

మధుసూదన్ సారు మామూలు టీచరా? ఈ రెండు నెలల్లో ఎంత ఆప్తుడయిపోయాడు ఆయన! ప్రతీ స్టూడెంటునీ పేరుపెట్టి పిలుస్తాడు, భుజాల మీద చేతులు వేస్తాడు, కళ్లల్లోకి చూస్తాడు. మనసులోకి జొర పడతాడు! ఆయన చెప్పేవి పాఠాలా? కథలు, కబుర్లు, పాటలు, పద్యాలు, నాటకాలు! ఆయన పాఠం ఎక్కడ మిస్ అయిపోతామో అని బెంగ పెట్టుకుంటాం. అంతగా ప్రతీ ముక్కా అర్థమయేసారుని ఇదివరకు మేం చూళ్లేదు. మీరెందుకో ఆయన్ని పంపించేస్తారని వింటున్నాం. అలా అయితే స్కూలు స్కూలంతా స్ట్రైక్ చెయ్యడానికి సిద్ధం!

ఆ రోజు రాత్రంతా పద్మిని మేలుకొనే ఉంది! మామూలుగా అమలుచేసే ధ్యానం ఆమెకి శాంతిని ఇవ్వలేకపోయింది! కొడుక్కి ఫోన్ చేద్దామను కుంది గాని ఆ మధ్య మనవడి పుట్టినరోజు ఇక్కడ వైభవంగా చేద్దామని ప్లాన్ చేసి వాడికి రాస్తే వాడి తిరస్కారం మరచిపోలేనిది:

'అమ్మా, ఎప్పుడో జరిగినదాన్ని ఇప్పుడు ఎత్తి పెడుతున్నందుకు నన్ను క్షమించు. తాతయ్యా, బామ్మా నీకు బాల్యమంటూ లేకుండా చేశారు. ఎంతో కష్టపడి కొంతవరకైనా నా బాల్యాన్ని నేను దక్కించుకున్నాను. నీ మనవణ్ణైనా ఆడుతు పాడుతూ వాడి కిష్టమైనట్టు బతకనీ'.

ఇంత కటువుగా రాసినవాడికి కొత్త టీచరుతో తనకి వచ్చిన తల నెప్పిని ఏ మొహం పెట్టుకుని తెలియజెయ్యాలి!

రెండ్రోజులు ఆలోచించి ఆమె ఓ నిర్ణయానికి వచ్చేసింది. స్వామి సమక్షం ఒక్కటే తనకి శాంతిని ప్రసాదించేది. వారం రోజులు శలవు పెట్టి ఢిల్లీకి టిక్కెట్టు కొనుక్కుంది. అక్కణ్ణుంచి హృషీకేశ్ వెళ్లొచ్చు. ఆ పవిత్ర ప్రదేశాలు చూడాలని ఎప్పట్నుంచో అనుకుంటోంది.

***

ఏదో స్టేషనల్లో రైలు ఆగడంతో వర్తమానం లోకి వచ్చి పడినట్టైంది పద్మిని మనసు. మొహం కడుక్కుని ఇన్ని మంచినీళ్లు తాగింది. పై బెర్త్‌లో మఠం వేసుకుని కూచున్న ఆరేళ్ల పిల్ల ఏదో మాటాడుతున్నట్టనిపించింది. తలెత్తి అటు చూసింది.

రాత్రయినా ఆ అమ్మాయి చక్కబెడుతున్న వ్యవహారం ఓ కొలిక్కి వచ్చినట్టు లేదు. అందరూ పడుకున్నా దాన్ని కొనసాగిస్తున్నట్టే ఉంది. ఇంతకీ ముచ్చటైన ఆ అమ్మాయి వెలగబెడుతున్న రాచకార్యం ఏమిటంటే తన కాళ్ల మీద పడుకో బెట్టుకున్న బార్బీ బొమ్మని మస్తుమస్తుగా ముస్తాబు చెయ్యడం! దాన్తో ఊసులాడ్డం!

'ఏమే, నీకీ పొంటు నచ్చిందా? చున్నీకి ఇక్కడ క్లిప్ పెడితే సరిపోతుందా? చూడు చిన్న తిలకం స్టిక్కర్ అంటించాను. పెద్దదైపోతే తీసేస్తాలే. కాజల్ ఎక్కువై పోయిందని కోపమా! సారీ తుడిచేస్తాను, కదలకు.'

ప్రాణం లేని బొమ్మతో జ్ఞానం వచ్చిన పిల్ల అలా మాటాడుతుంటే ఆ అపరాత్రి వేళ ప్రతి ముక్కా చెవినపడిన పద్మినికి ఏవేవో, ఎప్పుడూ ఎరగనివి, తన మనసులోకి జొరపడినట్టైంది.

అయితే అసలైన కనువిప్పు కలిగించే ఘట్టం. ఆ తర్వాత సిద్ధంగా ఉందని ఆ క్షణం ఆమె ఎరగదు.

ఆ అమ్మాయి చిన్న అద్దం తీసింది: ఆ బొమ్మ ఎదురుగా పెట్టింది.

'ఇదిగో బుజ్జీ, అద్దం చూసుకో. నా ముస్తాబు నీకు నచ్చిందా, సరిగ్గా చూసుకున్నావా!'

పద్మిని త్రుళ్లి పడింది.

అద్వైతమూ, ఆధ్యాత్మికతా అంటారే, ఇవేనా!

బింబ ప్రతిబింబాలు మానవ జీవితానికి అర్థం ఇదేనా!

తెలిసీ తెలియని బాల్యంలో విరిసీ విరియని సౌందర్యం అంతరార్థం తనకిన్నాళ్లకి తెలిసిందా!

జీవితం ఆడించే దాగుడుమూతలకి చిన్నప్పుడు ఆడుకునే ఆటల్లోనే సూచన ఉంటుందా!

పంచ భూతాలతో పరవశించి ఆడుకుని తమంత తామే ఎదిగే అవకాశం తల్లిదండ్రులు పిల్లలకి కల్పిస్తే పరిణితిచెందిన వయసులో వారు స్వేచ్ఛగా హాయిగా బతికే అవకాశం కల్పించినట్టు కాదా!

ఇవేనా, ఇంకో అన్ని ప్రశ్నలు పద్మినిని నిలదీశాయి. అద్దంలో చూసుకున్న ప్రతిబింబాన్ని మనమే అనుకుని ముఖ కవళికల్ని చేత్తో దిద్దుకోడం నిజమా, భ్రమా?

కళ్లకు కట్టించే హృదయ విదారక దృశ్యం చూస్తే గుండె కరిగి కన్నీరు రావడం మాయా, మర్మమా?

ఇంతెందుకు అమ్మా నాన్నా పోయి అన్నేళ్లు దాటినా వాళ్ల ఫొటో పర్సులో పెట్టుకుని అప్పుడప్పుడు తీసి చూసుకుంటుంటే గుండె కొట్టుకోడం కలా, నటనా?

ప్రశ్నలోనే జవాబు దొరికినట్టైంది పద్మినికి. బాల్యంలోనే జీవితమంతా ముడిపడి ఉన్నట్టు స్పష్టమైంది. ఇక తను ముందుకెళ్ల వలసిన పని లేదు. మహానుభావులు మరెక్కడో లేరు. మనసున్న మన పిల్లల్లోనే ఉన్నారు. చేరిన పెద్ద స్టేషనులో దిగిపోయి తిరుగు ప్రయాణం పెట్టుకుంది.

బాగా ఆలోచించి వచ్చిన మర్నాడే కొడుక్కి ఫోన్ చేసింది.

వాడికి ఇష్టంలేకపోయినా సరే తను వాణ్ణి 'చిన రాజులుంగారూ' అని పిలవడం తోనే తృప్తి పడేది. ఇన్ని తెలిశాక ఇప్పుడలా ఎలా పిలుస్తుంది?

'ఒరే రాజా' అని మొదటిసారి సంబోధించింది.

'చూడు నాకో కొత్త విషయం. ఆలస్యంగానైనా తెలిసింది. ఇదీ స్వామీ నిర్మలానంద మహరాజ్ అనుగ్రహమే అనుకుంటాను. ఆస్తీకాదు అధికారమూ కాదు పిల్లలకి కావలసింది వాళ్ల ఇష్టమైనట్టు పెరగనిచ్చే ప్రేమ. నేనిక నీ కొడుక్కి నీడని కాను, వెలుగునే. ఉన్న పళాన అక్కడన్నీ సెటిల్ చేసేసుకుని మీరు ముగ్గురూ ఇక్కడికి తగలడండి. నాలుగు రోజుల్లో రాకపోయారో నెక్స్ట్ ఫ్లైట్‌లో నేనక్కడికి సిద్ధం' అమ్మ.

☆

రచయిత సెల్ నెం: **98662 221575**

